'జగనన్న ఆరోగ్య సురక్ష' దేశానికే ఆదర్శం


కుమ్మరి వీధిలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మేయర్ బీవై.రామయ్య

కర్నూలు (టౌన్): రాష్ట్రంలో అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమని వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై.రామయ్య స్పష్టం చేశారు. గురువారం స్థానిక 4వ వార్డు బండిమెట్ట కుమ్మరి వీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మేయర్ ప్రారంభించారు. సురక్ష క్యాంపు సేవలపై అక్కడకు వచ్చిన రోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో ఆరోగ్య శ్రీ ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడారని, ప్రస్తుతం ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో ప్రతి వార్డులో ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలతో పాటు మందులు అందిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్య వ్యవస్థకు జీవం పోసిందన్నారు. ప్రస్తుతం జీవన శైలిలో వస్తున్న మార్పుల వల్ల అనేక మంది దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఈ వ్యాధులను ముందే గుర్తించి సరైన వైద్యం అందిస్తోందని వివరించారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక కార్పొరేటర్లు ఆర్షియా ఫర్హీన్, డాక్టర్ టి.అపర్ణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

10లోపు ఎఫ్‌ఎల్‌సీ పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): నవంబర్ 10వ తేదీలోగా ఓటింగ్ పరికరాల పనితీరు పరిశీలన, ఫస్ట్ లెవల్ చెక్(ఎఫ్‌ఎల్‌సీ) ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో కొనసాగుతున్న ఓటింగ్ పరికరాల పనితీరును పరిశీలించే ఫస్ట్ లెవల్ చెక్ ప్రక్రియను పరిశీలించారు. నిబంధనలు మేరకు ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను చేపట్టాలని బెల్ ఇంజినీర్లను ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు వచ్చే అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. అంతకుముందు ఆమె ఎఫ్‌ఎల్‌సీ సూపర్‌వైజర్, డీపీఓ నాగరాజునాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్‌లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన పత్తికొండ ఆర్డీఓ


జిల్లా కలెక్టర్‌కు డాక్టర్ సృజనకు పూలబొకే అందజేస్తున్న పత్తికొండ ఆర్డీఓ రామలక్ష్మి

కర్నూలు(సెంట్రల్): పత్తికొండ ఆర్డీఓగా నియమితులైన నీలపు రామలక్ష్మి గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజనను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లోని ఆమె చాంబరులో ఆర్డీఓ కలెక్టర్‌కు పూలబొకే అందజేశారు. రీసర్వే, ఎన్నికల జాబితా సరవణ తదితర అంశాలపై దృష్టి సారించి డివిజన్‌లో పురోగతి సాధించాలని కలెక్టర్ సూచించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి


వాల్‌మార్టు వద్ద స్మార్ట్ స్ట్రీట్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు(టౌన్): నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నగర పాలక కమిషనర్ భార్గవ్ తేజ ఆదేశించారు. గురువారం నగరంలో అభివృద్ధి పనులను కమిషనర్ తనిఖీ చేశారు. స్థానిక వాల్‌మార్టు సమీపంలో చేపడుతున్న స్మార్ట్ స్ట్రీట్ పనులు, గుత్తి పెట్రోల్ వెండర్ జోన్ పనులు, ఐటీసీ దగ్గర వెండర్ జోన్ పనులు, వెంకటాద్రినగర్‌లో పార్కు అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. పనుల ప్రగతిని మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ షాకీర్ హుస్సేన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. పనుల్లో ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు. అలాగే నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు.

30న ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 30 వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల్ బ్యాడ్మింటన్ (సిల్వర్ జూబ్లీ కళాశాల క్రీడా మైదానంలో),లాన్ టెన్నిస్ (జొహరాపురం)లో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు.

29న కాంగ్రెస్ ఓబీసీ సమావేశం

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ ఓబీసీ రాష్ట్ర స్థాయి సదస్సును ఈనెల 29వ తేదీన గుంటూరులోని ఏటుకూరు వివాహాల కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కులగణనను కచ్చితంగా జరపాలని డిమాండ్ చేసిన పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరా రెడ్డిలను సన్మానించనున్నారని, అలాగే కెప్టెన్ అజయ్‌సింగ్ యాదవ్ హాజరుకానున్నట్లు చెప్పారు.

విజయమే లక్ష్యంగా రాణించాలి


సెపక్‌తక్రా రాష్ట్ర జట్టుతో సీఈఓ రమణ

కర్నూలు (టౌన్): విజయమే లక్ష్యంగా సెపక్‌తక్రా క్రీడాకారులు రాణించాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. గోవాలో ఈనెల 30న నిర్వహించనున్న జాతీయ క్రీడల్లో భాగంగా రాష్ట్ర సెపక్‌తక్రా జట్టుకు శిక్షణా శిబిరం గురువారం సాయంత్రం ముగిసింది. జాతీయ పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారులకు సీఈఓ క్రీడాదుస్తులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ జాతీయస్థాయి పోటీల్లో ఏపీ జట్టు బంగారు పతకం సాధించాలని ఆకాంక్షించారు. సెపక్‌తక్రా రాష్ట్ర శిక్షకులు అమర్నాథ్, ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని విజయవంతం చేద్దాం

కర్నూలు(అర్బన్): ఈ నెల 28వ తేదీన వాల్మీకి మహర్షి జయంతిని విజయవంతం చేద్దామని జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పి. వెంకటలక్ష్మమ్మ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ.సృజన ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని గురువారం ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు స్థానిక గౌరీ గోపాల్ హాస్పిటల్ ఎదురుగా ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం 11 గంటలకు జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ భవనంలో జయంతి ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థి సంఘ నాయకులు, బోయ/వాల్మీకి సామాజిక వర్గం ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

స్టాఫ్ నర్సు పోస్టులకు భారీ స్పందన

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎస్ఎన్‌సీయూ-2, ఎన్‌బీసీయూలలో స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేసేందుకు గురువారం నిర్వహించిన వాక్ ఇన్ ఇంటర్వ్యూకు భారీ స్పందన లభించింది. ఈ పోస్టుల భర్తీకి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అధికారులు దరఖాస్తుల స్వీకరించారు. ఎస్ఎన్‌సీయూలో 14, ఎన్‌బీసీయూలో 14 స్టాఫ్ నర్సు పోస్టులు, ఎస్ఎన్‌సీయూలో 4 సపోర్టింగ్ స్టాఫ్ పోస్టులకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. స్టాఫ్ నర్సు పోస్టులకు 868, సపోర్టింగ్ స్టాఫ్ పోస్టులకు 108 దరఖాస్తులు వచ్చినట్లు ఏఓ అరుణ తెలిపారు.

అభ్యర్థులకు కనీస సౌకర్యాలు కరువు

స్టాఫ్ నర్సు, సపోర్టింగ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి గాను నిర్వహించిన వాక్ ఇన్ ఇంటర్వ్యూకు ఉదయం నుంచే భారీగా అభ్యర్థులు తరలివచ్చారు. వీరు నిలబడేందుకు షామియానాలు, తాగేందుకు మంచి నీటిని సైతం అధికారులు ఏర్పాటు చేయలేదు. వీరిని నియంత్రించేందుకు కార్యాలయంలో ఏ ఒక్క సిబ్బంది ముందుకు రాకపోవడంతో అభ్యర్థులు ఒకరిపై ఒకరు తోసుకుంటూ దరఖాస్తులు ఇవ్వాల్సి వచ్చింది. ఈ పరిస్థితుల్లో గందరగోళం నెలకొనడంతో దరఖాస్తుల స్వీకరణను కాసేపు ఆపేశారు. నిర్ణీత సమయం సాయంత్రం 5 గంటల వరకు ఉండటం, అప్పటికే భారీగా అభ్యర్థులు క్యూలైన్‌లో ఉండటంతో మొత్తం దరఖాస్తులన్నీ స్వీకరించడానికి మరో గంటన్నర సమయం పట్టింది. ఈ క్రమంలో కొందరు అభ్యర్థుల దరఖాస్తులను అక్కడి ఉద్యోగులు తిరస్కరించారు. ఆలస్యంగా వచ్చాయని, సరైన పత్రాలు లేవని కారణాలు చూపుతూ వెనక్కు పంపారు. ఎంతో దూరం నుంచి వ్యయ ప్రయాసలకు ఓర్చి దరఖాస్తు ఇవ్వడానికి వస్తే తిరస్కరించడం ఏమిటని ఉద్యోగులతో అభ్యర్థులు వాదనకు దిగారు. అభ్యర్థులు ఇచ్చిన దరఖాస్తులను తీసుకుని ఎలాంటి సీరియల్ నంబర్ వేయకుండానే అక్‌నాలెడ్జ్‌మెంట్ పత్రాలను ఇచ్చారు. దీంతో తమ దరఖాస్తులను ఎలా చూసుకోవాలని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రబాబు అరెస్ట్‌తో సానుభూతి టీడీపీ భ్రమే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు సిటీ: రాబోయే 2024 ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని, ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. గురువారం స్టాంటన్ పురంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలి' కార్యక్రమంపై కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఆయా గ్రామాల పార్టీ కార్యకర్తలతో సమావేశం అయ్యారు. ప్రతి కార్యకర్త నాలుగు నెలలు సైనికుడిలా పనిచేసి పార్టీని గెలిపించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. గత తెలుగుదేశం పాలన, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను వివరించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో యాత్ర చేపట్టిందన్నారు. వాస్తవానికి నిజం అనేది గెలిచింది కాబట్టే చంద్రబాబు అవినీతి కేసులో అరెస్ట్ అయ్యారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బాబు అరెస్ట్‌తో సానుభూతి రాదని, అది అంతా భ్రమనేనని స్పష్టం చేశారు. ప్రతి సచివాలయం పరిధిలో సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధి, ఏఏ పథకాలు గతంలో ఎంతమందికి వచ్చేవి, ప్రస్తుతం ఎంత మందికి వస్తున్నాయనే విషయంపై డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూరల్ మండలాధ్యక్షుడు మహబూబ్ బాష, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతిని కాపాడేందుకు ఉత్సవాలు


కరపత్రాలను విడుదల చేస్తున్న డీటీడబ్ల్యూఓ శివప్రసాద్

కర్నూలు(అర్బన్): జాతీయ గిరిజన సాంస్కృతిక మహోత్సవ కరపత్రాలను గురువారం జిల్లా గిరిజన సంక్షేమాధికారి కేవీ శివప్రసాద్ విడుదల చేశారు. స్థానిక డీటీడబ్ల్యూఓ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప మాట్లాడుతూ నవంబర్ 28, 29 తేదీల్లో పార్వతీపురం జిల్లా సీతంపేట ఐటీడీఏలో ఆదివాసీ గిరిజన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అంతరించిపోతున్న గిరిజన ఆచార, సాంప్రదాయాలు, సంస్కృతులను కాపాడేందుకు ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఏ రాష్ట్ర అధ్యక్షులు మధుకృష్ణ, టీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి పీ వెంకటేష్, గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు

కర్నూలు (న్యూటౌన్): విధి నిర్వహణలో నిర్లక్ష్యం వ్యవహరించిన జిల్లా పోలీసు శాఖకు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లను సర్వీసు నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా 2019లో కానిస్టేబుల్ జానకిరామ్ ఐదు మాసాలు విధులకు గైర్హాజరయ్యారు. ఈ విషయంపై అప్పటి ఎస్పీ సిద్దార్థ కౌశల్ డీఎస్పీతో విచారణ జరిపించారు. ప్రభుత్వానికి ఎస్పీ సిద్దార్థ కౌశల్ నివేదిక సమర్పించి చర్యలకు సిఫారసు చేశారు. ఈ మేరకు ప్రభుత్వం అతన్ని శాశ్వతంగా సర్వీసు నుంచి తొలగిస్తూ గురువారం జీఓ జారీ చేసింది. అలాగే స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ అశోక్‌కుమార్ ఈ ఏడాది జనవరి 8వ తేదీ నుంచి పై అధికారులకు సమాచారం ఇవ్వకుండా 21 రోజుల పాటు విధులకు గైర్హాజరయ్యారు. ఇతనిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి అప్పటి ఎస్పీ సిద్ధార్థకౌశల్ నివేదిక పంపించారు. అతనిపై వేటు వేస్తూ శాశ్వతంగా సర్వీసు నుంచి తొలగిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది.

పారదర్శకంగా స్కిల్ టెస్ట్


అభ్యర్థులకు స్కిల్ టెస్ట్ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు సిటీ: జిల్లాలోని భవిత కేంద్రాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సహిత విద్యా రిసోర్స్ పర్సన్ పోస్టులకు సంబంధించి స్కిల్ టెస్ట్ గురువారం పెద్దపాడు ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులకు ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పున మెరిట్ ప్రాతిపదికన జాబితాను ఎంపిక చేశారు. ఈ జాబితాలో ఉన్న వారికి స్కిల్ టెస్ట్ కమిటీలో ఉన్న డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, కర్నూలు, నంద్యాల డీఈఓలు డాక్టర్ వి.రంగారెడ్డి, సుధాకర్ రెడ్డి, సమగ్ర శిక్ష అదనపు కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.వేణుగోపాల్ పాల్గొన్నారు. ఆయా పోస్టులకు అర్హులై మెరిట్ జాబితాలో ఉన్న వారికి నైపుణ్య పరీక్ష నిర్వహించారు. ఎంపిక పారదర్శకంగా జరుగుతోందని, ఎవరైన డబ్బులు డిమాండ్ చేస్తే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకరావాలని కమిటీ సభ్యులు తెలిపారు. స్కిల్ టెస్ట్‌కు మొత్తం 42 మంది అభ్యర్థులు హాజరయ్యారు.

రక్తహీనతను నివారించాలి


విద్యార్థినికి ఐరన్ మాత్ర మింగిస్తున్న హేమలత

కర్నూలు(హాస్పిటల్): రక్తహీనతతో బాధపడుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా మందులు పంపిణీ చేస్తోందని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత చెప్పారు. గురువారం ఆమె నగరంలోని ముజఫర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న విఫ్స్ కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించే ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడడం వల్ల రక్తహీనత నివరించవచ్చన్నారు. విద్యార్థినులకు మధ్యాహ్న భోజనం తర్వాత ఐరన్ మాత్రలను మింగించారు. ఆమె మాట్లాడుతూ శరీరంలో ఐరన్ లోపిస్తే రక్తహీనత ఏర్పడి విద్యార్థులు నీరసం, నిస్సత్తువతో చదువులో వెనకబడిపోతారని పేర్కొన్నారు. అలాగే బాల్య వివాహాలను నివారించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హార్మోనిస్టు రామలింగంకు సన్మానం

కర్నూలు(సెంట్రల్): కర్నూలు కళాకారుల సేవా కేంద్రం ఆధ్వర్యంలో బంగారు వీణ అవార్డు గ్రహీత, హార్మోనిస్టు రామలింగంకు ఘన సన్మానం జరిగింది. కల్లూరులోని రైతు నిలయంలో ఆ సంఘం అధ్యక్షుడు బైలుప్పల షఫీవుల్లా, కర్నూలు రంగస్థలం కళాకారుడు పి.హనుంతరావు చౌదరి ఆధ్వర్యంలో ఆయనకు శాలువ కప్పి సన్మానం చేశారు.

అలరించిన 'శ్రీకృష్ణ తులాభారం'


కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ముత్తరాజు సుబ్బారావు రచించిన శ్రీకృష్ణ తులాభారం పద్య నాటక ప్రదర్శన ఆహూతులను అలరించింది. గురువారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ఈ తులాభార నాటక ప్రదర్శనను కర్నూలు జిల్లా కలెక్టర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన గుమ్మళ్ల బలరామయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. శ్రీకృష్ణ తులాభారంలో శ్రీకృష్ణుడిగా డాక్టర్ అవార్డును శనివారం అందుకోనున్న రంగస్థల నటుడు ఏ.కోటేశ్వరరావు, సత్యభామగా రాయలసీమ ముద్దుబిడ్డ ఆంధ్ర పద్య నాటక నాయకి జి.రత్నశ్రీ నటించారు. అనంతరం తులభార నాటకం నాయక, నాయికీలను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ జయం శేషయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు కేజీ గంగాధరరెడ్డి, దస్తగిరి, మహ్మద్ మియ్యా తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న జేడీ రంగలక్ష్మిదేవి

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించరాదని సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జే రంగలక్ష్మిదేవి సూచించారు. గురువారం స్థానిక సంక్షేమభవన్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలోని సహాయ సంక్షేమాధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. జిల్లా ఉన్నతాధికారులతో పాటు న్యాయమూర్తులు హాస్టళ్లను ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నారన్నారు. అలాగే గ్రామ/వార్డు సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు హాస్టళ్లను పరిశీలించి ఆయా వసతి గృహాల్లో వారి దృష్టికి వచ్చిన లోటుపాట్లను కన్సిస్టెంట్ రిథమ్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తారన్నారు. గుర్తించిన లోటుపాట్లను వెంటనే పరిష్కరించేందుకు వసతి గృహ సంక్షేమాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. డైరెక్టర్ ఆదేశాల మేరకు హాస్టళ్లకు విడుదల చేసిన బడ్జెట్‌ను వినియోగించాలని సూచించారు. అలాగే జగనన్న విద్యా, వసతి దీవెనకు సంబంధించి అర్హులైన విద్యార్థుల ఈ-కేవైసీని పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని సబ్ డివిజన్ లెవెల్‌లో ఆర్‌డీఓలను కలిసి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేసి నిర్ణీత సమయంలో సమావేశాలు నిర్వహించాలన్నారు. వసతి గృహాల్లో మెనూ తప్పక పాటిస్తూ వంద శాతం బయోమెట్రిక్ హాజరు నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కర్నూలు, పత్తికొండ, ఆదోని, కోడుమూరు సహాయ సంక్షేమాధికారులు బీ.మద్దిలేటి, కే.బాబు, సుధాకర్‌బాబు, ఎస్.లీలావతి, కార్యాలయ పర్యవేక్షకులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో డోర్ డెలివరీ చేయాలి

కర్నూలు(రాజ్‌విహార్): సామగ్రి డోర్ డెలివరీని సంస్థ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని జిల్లా ప్రజా రవాణా శాఖ కర్నూలు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కేవీ రమణ అన్నారు. డోర్ డెలివరీ మాసోత్సవాల ప్రారంభం సందర్భంగా గురువారం స్థానిక కర్నూలు-1 డిపో గ్యారేజీ ముందు పార్సిల్స్ డోర్ డెలివరీపై సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పార్సిళ్లను సకాలంలో డోర్ డెలివరీ అందించి వినియోగదారుల మన్ననలు పొందాలన్నారు. డిపో మేనేజర్ సుధారాణి, అసిస్టెంట్ మేనేజర్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పర్ పట్టివేత

కర్నూలు (న్యూసిటీ): రోడ్డు మెటల్‌ను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. గురువారం వెల్దుర్తి వద్ద అనుమతి లేకుండా రోడ్డు మెటల్‌ను తరలిస్తున్నారనే సమాచారంతో మైనింగ్ అధికారులు వెళ్లి తనిఖీ చేశారని ఆయన చెప్పారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుకున్న టిప్పర్ యజమానికి రూ.15 వేలు అపరాధ రుసుం విధించామని చెప్పారు. ప్రభుత్వానికి ఆదాయానికి నష్టం కలిగిస్తున్న అక్రమార్కులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని ఆయన హెచ్చరించారు.


ఎస్.కొంతలపాడులో సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

సురక్షతో ప్రజారోగ్యానికి రక్షణ

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- సురక్ష వైద్య శిబిరాలకు విశేష స్పందన
- కొమరోలులో రైతు భరోసా కేంద్రం ప్రారంభం


కొమరోలులో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఎస్.కొంతలపాడు గ్రామంలో నిర్వహించిన సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన పర్యవేక్షించారు. హుసేనాపురం వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని చికిత్సలు పొందారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం 108, 104, ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేశారన్నారు. అదే బాటలో ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను అమలు చేసి, ఇంటింటి సర్వే నిర్వహించి, ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఖరీదైన వైద్యం గ్రామాల్లోనే అందిస్తున్నట్లు తెలిపారు. సాధారణ జబ్బులతో పాటు, బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లద్దాలను పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. నిరంతరం ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని, ఓట్లకోసం మాటలు చెప్పి, మోసగించే పార్టీలకు స్వస్తి పలకాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంఈఓ ఓంకార్‌యాదవ్, వైద్యాధికారి అమరనాథ్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్ గౌడు,సర్పంచ మధుకేశన్న తదితరులు పాల్గొన్నారు.

రైతుల సౌలభ్యం కోసమే ఆర్‌బీకేలు

రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గ్రామస్థాయిలో వ్యవసాయ సేవలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కొమరోలు గ్రామంలో రూ.24 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే, రూ.17 లక్షలతో నిర్మించిన పాలశీతలీకరణ కేంద్రం భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలలో పాడిపరిశ్రమను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో బల్క్ మిల్క్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాడి గేదెల పెంపకంపై ఆసక్తి గల రైతులకు ప్రభుత్వం రుణసాయం అందిస్తుందని చెప్పారు. ఆర్బీకేల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, రసాయన మందులను అందజేస్తోందని పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు రామచంద్రయ్య, అసిస్టెంట్ డైరెక్టర్ పార్థసారథి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, పశువైద్యాధికారి పద్మలత, మండల అధికారులు పాల్గొన్నారు.

అసమానతలు లేని సమాజమే లక్ష్యం


ర్యాలీగా వస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): అసమానతలు లేని సమాజమే సీపీఎం లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ప్రజలను కోరారు. గురువారం జొహరాపురంలో సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న ప్రజాభేరీ బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా రక్షణ భేరీ బస్సు యాత్ర ఆదోనిలో 30వ తేదీన ప్రారంభం అవుతుందన్నారు. అదే రోజు సాయంత్రానికి కర్నూలు చేరుకుంటుందని, అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. అలాగే బస్సు యాత్ర విజయవంతం కోసం కర్నూలు నగరంలోని ఒకటో వార్డు ఖండేరి వీధిలో ఆవాజ్ కమిటీ నాయకులు ఎండీ షరీఫ్ ఆధ్వర్యంలో, కల్లూరులోని 31వ వార్డు పరిధిలోని శరీన్ నగర్‌లో సుధాకరప్ప ఆధ్వర్యంలో, పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం సమీపంలో నగర కార్యదర్శి టి.రాముడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీపీఎం నగర కార్యవర్గ సభ్యుడు విజయ్, రామాంజనేయులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

కర్నూలు(రాజ్‌విహార్): వివిధ కారణాలతో ఏర్పడే విద్యుత్ అంతరాయ సమస్యలపై నిర్లక్ష్యం ప్రదర్శించరాదని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి ఆదేశించారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కిందిస్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. సరఫరాలో అంతరాయ సమస్యలు రాకుండా తరచూ నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. వీటిపై సరైన దృష్టి పెట్టని పక్షంలో బ్రేక్ డౌన్, ట్రిప్పింగ్స్, ఫీడర్ డౌన్, ఎగ్జిఫ్యూజ్ పాడవడం, ఫ్యూజ్ ఆఫ్ కాల్, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫ్యూజ్ కాలిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయని పేర్కొన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జయప్రదం చేయండి


మాట్లాడుతున్న ఎస్.మునెప్ప

కర్నూలు(సెంట్రల్): ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కోరారు. గురువారం ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31వ తేదీన ఏఐటీయూసీ ముంబైలో ఆవిర్భవించిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు కార్మిక సమస్యల పరిష్కారమే అజెండాగా పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను కాలరాసి నాలుగు కోడ్‌లుగా విభజించడం అన్యాయమని మండిపడ్డారు. దీనిపై కార్మిక లోకం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు జి.చంద్రశేఖర్, ఈశ్వరప్ప తదితరులు పాల్గొన్నారు.